ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY 5 జయశంకర్ భూపాలపల్లి

శనివారం 12 జూలై 2025

- ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పోటెత్తుతున్న ప్రవాహం
- రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో..
- భూపాలపట్నం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాకపోకలకు బ్రేక్
- పేరూరు వద్ద 15.42 మీటర్లకు చేరిన నీటి ప్రవాహం
- పలు గ్రామాలకు నిలిచిన రాకపోకలు
- జలమయం అవుతున్న లోతట్టు ప్రాంతాలు.. అధికారుల అప్రమత్తం
- సమ్మక్క సాగర్‌లోకి భారీ వరద.. బ్యారేజీలోని మొత్తం గేట్ల ఎత్తివేత
- మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద
- 8.68 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో
- మంగపేట మండలంలో గోదావరి వరదతో వ్యవసాయ భూములకు కోత

ఉరకలెత్తుతున్న గోదావరి



రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి ఉధృతి

ములుగు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది వరవళ్లు తొక్కుతోంది. కన్నాయిగూడెం తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క- సారలమ్మ బ్యారేజీకి 7లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతుండడంతో బ్యారేజీలో మొత్తం 59 గేట్లు ఎత్తి దిగువకు నీటిని విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం బ్యారేజి వద్ద 82.10 మీటర్ల నీటిమట్టం నమోదయింది. అదే విధంగా ఏటూరునాగారం మండలం పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం పుష్కరఘాట్ వద్ద ఉదయం 8 గంటలకు గోదావరి నీటిమట్టం 13.990 మీటర్లు ఉండగా మధ్యాహ్నం 2 గంటలకు 14.260 మీటర్లకు చేరి క్రమంగా పెరిగింది. సాయంత్రం 5 గంటలకు పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటి 14.400 మీటర్లకు చేరింది. ప్రవాహం క్రమంగా పెరుగుతుండడంతో మొదటి ప్రమాద హెచ్చరికకు దాటి ప్రవహించనున్నట్లు జల వనరుల శాఖాధికారులు అంచనా వేస్తున్నారు. వాజేడు మండలంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండడంతో పూసూరు - ఎడ్జర్లపల్లి వద్ద రాకపోకలు నిలిచిపోయాయి. పేరూరు- చంద్రుపట్ల, వాజేడు- గుమ్మడిదొడ్డికి గోదావరి ప్రవాహంతో రాకపోకలు నిలిచిపోయాయి. 163వ జాతీయ రహదారిపైకి గోదావరి వరద నీరు భారీగా చేరడంతో భూపాలపట్నం-హైదరాబాద్ జాతీయ రహదారిపై అంతర్‌రాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. మంగపేట మండలంలో గోదావరి ఉధృతంగా ప్రవహిస్తోంది. కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్ వెల్ వద్ద గోదావరి నీటి మట్టం 8.5 ఫీట్లకు చేరుకుంది.


(పూర్తి వివరాలు: 7లో)



బిల్ట్ ఇన్‌టెక్ వెల్ వద్ద గోదావరి వరద



అంతర్రాష్ట్ర రాకపోకలు నిలిపివేసిన పేరూరు పోలీసులు



సమ్మక్క బ్యారేజీలోకి వస్తున్న వరద

వనదేవతల ఘన కీర్తిని తెలియజేసేలా ఏర్పాట్లు

- వేల ఏళ్ల పాటు నిలిచేలా దేవస్థానం అభివృద్ధి
- ఇరువైపులా జంపన్న వాగు సుందరీకరణ
- మేడారంలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క



వనదేవతను దర్శించుకుంటున్న మంత్రి సీతక్క

తాడ్వాయి, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వనదేవతలు సమ్మక్క, సారలమ్మల ఘన కీర్తిని ప్రపంచ వ్యాప్తంగా తెలియజేసే విధంగా మేడారంలో ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క అన్నారు. శుక్రవారం తాడ్వాయి మండలంలోని మేడారం వన దేవతలను దర్శించుకొని మొక్కులు చెల్లించారు. అనంతరం పూజారులతో మాట్లాడుతూ 2026 జనవరి 28 నుంచి 31వ తేదీ వరకు జరుగబోయే మేడారం మహా జాతరలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు జరకుండా అన్ని ఏర్పాట్లను ముందుగానే చేస్తామని అన్నారు. ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు దెబ్బతినకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, జంపన్నల ఘన కీర్తిని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా ఏర్పాట్లు చేస్తున్నామని పూజారులకు వివరించారు. వేల సంవత్సరాల పాటు నిలిచేలా మేడారం దేవస్థానాన్ని సుందరీకరించి, అభివృద్ధి చేయడం జరుగుతుందని అన్నారు. ఇప్పటి వరకు జాతరలో శాశ్వత పనులు జరుగుతుండగా, మరో రూ.112 కోట్లతో సౌకర్యాల రూపకల్పనకు ప్రభుత్వానికి అంచనాలు తయారు చేసినట్లు చెప్పారు. మేడారం మహా జాతరను విజయవంతం చేయడానికి సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కృషి చేస్తున్నారని తెలిపారు. ఇందులో భాగంగా క్యూలైన్ల విస్తరణ పనులు జరుగుతున్నాయని అన్నారు. జిల్లా యంత్రాంగం జాతరను విజయవంతం చేయడానికి ముందస్తు ప్రణాళికలతో సిద్ధంగా ఉండాలని అన్నారు. జంపన్న వాగుకు ఇరువైపులా భక్తులు సేద తీరడానికి ఆహ్లాదకరమైన పార్కులు, సుందరీకరణ జరుగుతుందని మంత్రి పేర్కొన్నారు. మేడారం అభివృద్ధి పనులు పూజారుల ఆలోచనలప్రకారం జరుగుతాయని చెప్పారు. అదేవిధంగా ములుగు మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేగ కల్యాణి పదవీ బాధ్యతలు స్వీకరించి సమ్మక్క, సారలమ్మలకు మొదటి సారి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, దేవస్థానం కార్యనిర్వహణాధికారి వీరస్వామి, పూజారుల సంఘం అధ్యక్షుడు జగ్గారావు, సంబంధిత అధికారులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.



ముస్కాన్ మురిసేనా!?

- జిల్లాలో ఆరంభమైన ఆపరేషన్ ముస్కాన్
- ప్రతీ యేటా అడపాదడపా తనిఖీలు..
- సమన్వయ లోపం.. కలిసిరాని అన్ని శాఖలు
- 12 మండలాల్లో వారంలో 14 మంది బాలల గుర్తింపు

కృష్ణకాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించేందుకు.. ప్రతీ చిన్నారిని పాఠశాలలో చేర్పించేందుకు ప్రభుత్వం ప్రతీయేటా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. అనాథ బాలల చేరదీత, బాల కార్మికులు, డ్రాపౌట్ పిల్లల గుర్తింపు, వీధి బాలలను బడిలో చేర్పించేందుకు శిశు సంక్షేమ శాఖ, పోలీసు శాఖల నేతృత్వంలో మొత్తంగా మరో పది శాఖల సమన్వయంతో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. జూలై 1న ప్రారంభమైన ముస్కాన్ కార్యక్రమం.. ఈ నెల 31వ తేదీ వరకు కొనసాగనుంది. అయితే, అధికారుల సమన్వయం లోపం కనిపిస్తోంది. అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయిలో భాగస్వామ్యం కాలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. తనిఖీల్లో కేవలం చైల్డ్‌లైన్, పోలీసు శాఖలే పాలుపంచుకుంటున్నట్లు తెలుస్తోంది.

మారని తీరు..

ముస్కాన్ కార్యక్రమం ద్వారా పిల్లలను బాల కార్మికులుగా మార్చిన బాధ్యులపై అధికారులు చట్టపరంగా చర్యలు చేపట్టే అధికారం ఉంది. అలాంటి వారిపై అధికారులు చర్యలు సైతం తీసుకుంటుండగా యజమానుల్లో మాత్రం మార్పు రావడం లేదు. 18 ఏళ్లలోపు ఉన్న బాలలను పనిలో పెట్టుకున్న యజమానికి జరిమానా విధించి.. తల్లిదండ్రులతో పాటు పోలీసుల సమక్షంలో కౌన్సిలింగ్ ఇచ్చినా మార్పు రావడం లేనట్లుగా తెలుస్తోంది. భూపాలపల్లి జిల్లాలో ఈ వారంలో ఇప్పటి వరకు ముగ్గురిపై అధికారులు కేసులు నమోదు చేశారు.

సమన్వయం లోపం.?

జిల్లాలో నెల రోజుల పాటు నిర్వహించే ఈ టాస్క్‌లో అధికారుల మధ్య సమన్వయం లోపిస్తోంది. ఇందులో స్త్రీ శిశు సంక్షేమ శాఖలోని వివిధ విభాగాలు, పోలీసు శాఖ, కార్మిక శాఖ, వైద్యఆరోగ్య శాఖ, విద్యాశాఖ, రెవెన్యూ శాఖలతో పాటు మరికొన్ని శాఖలు ఆపరేషన్ ముస్కాన్‌లో పాల్గొని బాలలను బంధీ నుంచి విముక్తి చేయాల్సి ఉండగా.. ఆ పరిస్థితి జిల్లాలో కానరావడం లేదు. ఒక్క చైల్డ్ విభాగంతో పాటు పోలీసు శాఖ మాత్రమే ఈ కార్యక్రమంలో పాలు పంచుకుంటున్నాయి. అడపాదడపాగా కార్మిక శాఖ పాల్గొంటుండగా రెవెన్యూ, విద్య, వైద్యం, ఇతర శాఖలేవి పెద్దగా పాల్గొనడం లేదనే విమర్శలు బాహాటంగా వినిపిస్తున్నాయి. గడిచిన వారం రోజుల్లో 12 మండలాల్లో 14 మంది బాలలకు మాత్రమే విముక్తి కలిగింది.



బంధీగా బాల్యం..

చదువు, ఆట పాటలతో ఆనందంగా గడపాల్సిన చిన్నారుల బాల్యం బంధీగా మారుతోంది. ఆర్థిక స్థోమత, కుటుంబ పరిస్థితుల కారణంగా చాలా మంది పిల్లలు బాల్యానికి దూరమవుతున్నారు. కాగా, పట్టుబడ్డ బాలలంతా దాదాపు ఇతర రాష్ట్రాల వారే ఉంటున్నారు. ఇందులో ప్రధానంగా కలకత్తా, మహారాష్ట్ర, కర్నాటక, పశ్చిమబెంగాల్, బిహార్ తదితర రాష్ట్రాల వారున్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో పని దొరక్క పోవడంతో బతుకు దెరువు కోసమని తెలంగాణ వైపు వలసలు వస్తున్నట్లు తెలుస్తోంది. ఎలాంటి ఆధారంలేని తమకు పిల్లలను చదివించేంత స్థోమత కూడా లేకపోవడంతో తల్లిదండ్రులు తమ వెంటే పిల్లలను తీసుకొచ్చి పనిలోకి పెడుతున్నట్లుగా తెలిసింది. వీరితో పాటు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచి సైతం కొంత మంది బాలలు కార్మికులుగా మారి బంగారు భవిష్యత్‌ను కోల్పోతున్నారు.

నాలుగేళ్లలో పట్టుబడిన బాలల వివరాలు

	2021	2022	2023	2024
బాల కార్మికులు	26	22	18	20
భిక్షాటన	0	03	02	0
అనాథలు	0	0	0	0
చదువుమానేసిన పిల్లలు	0	0	02	0
నిరాశ్రయులు	0	01	05	0
బాల్య వివాహాలు	0	01	01	2
తప్పిపోయిన పిల్లలు	02	0	0	0
మొత్తం:	28	27	29	22

అన్ని శాఖలను సమన్వయ పరుస్తాం..

- కిరణ్‌ఖరే, ఎస్పీ భూపాలపల్లి జిల్లా



ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి అన్ని శాఖలను సమన్వయ పరుస్తాం. ఇప్పటికే అన్ని శాఖలతో సమావేశం నిర్వహించాం. మరోమారు సమావేశం నిర్వహిస్తాం. భూపాలపల్లి, కాటారం రెండు సబ్ డివిజన్లలో రెండు ప్రత్యేక టీమ్‌లు ఏర్పాటు చేశాం. ఇతర రాష్ట్రాల చిన్నారులే అధికంగా పట్టుబడుతున్నారు. బాలలను పనిలో పెట్టుకున్న ముగ్గురిపై కేసులు నమోదు అయ్యాయి. ఇంకా అలాంటి వారిని గుర్తించేందుకు నెల రోజుల వరకు కార్యక్రమం పకడ్బందీగా కొనసాగిస్తాం.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

- భూ భారతి దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలి
- జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ
- మండలంలో సుడిగాలి పర్యటన



గురుకులంలో వంటలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌శర్మ

కాటారం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ విద్యాలయాల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెనూ ప్రకారం భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ అన్నారు. కాటారం మండలంలో కలెక్టర్ శుక్రవారం సుడిగాలి పర్యటన చేశారు. దామెరకుంటలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకులాన్ని, గంగారం మోడల్ స్కూల్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. గురుకులంలో పరిశుభ్రతపై అసంతృప్తి వ్యక్తం చేశారు. వంట గది, డైనింగ్ హాల్‌లో పరిశుభ్రత సరిగా లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఆరోగ్యం దృష్ట్యా వంట గది, సరుకులు శుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తరగతి గదులు, ల్యాబ్‌లు, డార్మెటరీలను పరిశీలించి ఇంకా కావాల్సిన మౌలిక వసతులపై నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. తరగతి గదులు సరిపోవడం లేదని ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, గురుకులం వెనకాల ఖాళీగా ఉన్న ఆశ్రమ పాఠశాల భవనాన్ని పరిశీలించి మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. అనంతరం గంగారం మోడల్ పాఠశాలను సందర్శించి మరమ్మతు పనులను పరిశీలించి త్వరగా పూర్తి చేయాలన్నారు. పాఠశాల ముందు సీసీరోడ్డు, వంట గది నిర్మాణం, గ్రౌండ్‌లో బురద లేకుండా చేయాలని ప్రిన్సిపాల్ గోవర్ధన్ కలెక్టర్‌ను కోరగా నిధులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. హాస్టల్ భవనంలో గీజర్లతో పాటు కావాల్సిన మౌలిక సదుపాయాల గురించి నివేదికలు అందించాలని ఆదేశించారు. విద్యార్థులతో మాట్లాడి పలు సబ్జెక్టులపై ప్రశ్నించి సమాధానాలు తెలుసుకున్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివితే విజయాలు సొంతమవుతాయన్నారు. ప్రభుత్వం పేద విద్యార్థులకు కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని కలెక్టర్ రాహుల్‌శర్మ తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. కాళేశ్వరం ప్రాజెక్టు భూసేకరణ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. భూ భారతి దరఖాస్తుల వివరాలు, నోటీసులిచ్చిన వాటి గురించి తెలుసుకుని దరఖాస్తులను పరిశీలించి క్షేత్రస్థాయిలో పర్యటించి త్వరగా పరిష్కారం చేయాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. ఆయా కార్యక్రమాల్లో డీఈవో రాజేందర్, తహసీల్దార్ నాగరాజు, ఎంపీడీవో అడ్డూరి బాబు, డీటీ రామ్మోహన్, ఆర్.వెంకటయ్య, హెచ్ఎంలు గోవర్ధన్, మానస తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్నాడని పినతండ్రి హత్య

- బుగులోని గుట్టల్లో యువకుడి ఘాతుకం



రవి మృతదేహం

రేగొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తమను కొడుతూ నిత్యం వేధిస్తున్నాడనే కోపంతో పినతండ్రిని హత్య చేశాడు. ఈ సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా రేగొండ మండలంలోని తిరుమలగిరి గ్రామ శివారు బుగులోని జాతర గుట్టల సమీపంలో చోటు చేసుకుంది. పోలీసులు, గ్రామస్థులు తెలిపిపిన ప్రకారం... భూపాలపల్లి మండలం కొంపల్లి గ్రామానికి చెందిన పర్శ రవి (45) గొర్రెల కాపరిగా పనిచేస్తూ జీవనం సాగించేవాడు. రవి మొదటి భార్య లక్ష్మికి ఇద్దరు కుమారులు కాగా, ఆమెను 15 సంవత్సరాల క్రితమే వదిలేశాడు. అనంతరం భూపాలపల్లి మండలం గుడాటిపల్లికి చెందిన రేణుకను రెండో వివాహం చేసుకున్నాడు. అయితే (మిగతా 8వ పేజీలో)

సెల్ ఫోన్ చోరీ

ఫోన్‌పేలోని రూ.56,900 తస్కరణ..!

మరిపెడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఓ సెల్ ఫోన్ చోరీ చేసి.. ఫోన్‌పేలోని రూ.56,900 తస్కరణకు గురైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఈ విషయం శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ కావడంతో విషయం బయటికి పొక్కింది. బాధితులు, తెలిపిన వివరాల ప్రకారం.. మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని మమత కిరాణానికి గత రెండ్రోజుల కిందట ఓ ఇద్దరు అపరిచిత వ్యక్తులు ద్విచక్ర వాహనంపై కిరాణం సరకుల కోసం వచ్చారు. ఆ కిరాణం షాపు నిర్వాహకులు సోమ శ్రీనివాస్ భార్య మమత షాపులో ఉండగా ఆమెకు నిత్యవసర సరకుల లిస్ట్ ఇచ్చి వాటిని ప్యాక్ చేయమని చెప్పారు. ఇంతలో ఆ ఇద్దరులో ఒకరు రూ.1 ఫోన్‌పే మా కుటుంబ సభ్యులకు చేయండి, సరకులకు అవసరమైన డబ్బులు తిరిగి మీ నెంబరుకు ఫోన్‌పే చేయిస్తామని చెప్పారు. మమత తనకు ఫోన్‌పే చేయరాదని చెప్పింది. ఇంతలో ఆమె కుమారుడు రాగా, అతనితో రూ.1ఫోన్ పే చేశారు. ఈ క్రమంలో ఆ ఫోన్‌పే పిన్ నంబరు పసిగట్టిన నిందితులు ఇద్దరు మమత సెల్ ఫోన్ చోరీ చేశారు.

క్షణంలోనే అక్కడి నుంచి ఉడాయించారు. గిరిపురం దగ్గర్లోని ఓ పెట్రోల్ బంక్, తానంచర్ల శివార్లోని మరో పెట్రోల్ బంక్ నుంచి వారి అకౌంట్‌లోని రూ.56,900 కొద్ది సేపట్లోనే డ్రా చేసుకున్నారు. అదే రోజు బాధిత కుటుంబం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంక్‌ల్లోని సీసీ కెమెరాల ద్వారా ఆ అనుమానిత ఇద్దరు వ్యక్తుల పుటేజీని పోలీసులు సేకరించి కేసు ఛేదించే పనిలో నిమగ్నమైనట్లు తెలుస్తుంది.

మందుపాతర పేలిన ఘటనలో

గాయపడిన వృద్ధుడి మృతి

- ఈనెల 4న వెదురుబొంగుల కోసం అడవికి వెళ్లిన కామయ్య
- మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి తీవ్ర గాయాలు



కామయ్య (ఫైల్)

వెంకటాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లో మందుపాతర పేలిన ఘటనలో గాయపడ్డ సోయం కామయ్య(65) అనే వృద్ధుడు శుక్రవారం మృతి చెందాడు. ములుగు జిల్లా వెంకటాపురం మండల పరిధిలోని ముకునూరుపాలెం గ్రామానికి చెందిన కామయ్య అనే గిరిజనుడు ఈనెల 4వ తేదీన వెదురుబొంగుల కోసం అటవీ ప్రాంతానికి వెళ్లగా మావోయిస్టులు అమర్చిన మందుపాతర పేలి తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో గ్రామస్థులు హుటాహుటిన కామయ్యను గ్రామానికి తరలించి అక్కడి నుంచి వరంగల్‌లోని వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అదేరోజు హైదరాబాద్‌లోని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ఈ ఘటనలో కామయ్యకు ఎడమ కాలు మడిమ భాగం నుజ్జునుజ్జు అయి తీవ్ర గాయాలపాలయ్యాడు. ఈక్రమంలో వృద్ధుడైన కామయ్యకు తీవ్ర రక్తస్రావం కావడంతో ఆరోగ్య పరిస్థితి క్షీణించింది. దీంతో చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. కాగా, ఆయనకు కుమారుడు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కామయ్య మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. జీవనోపాధిలో భాగంగా వెదురుబొంగుల సేకరణకు వెళ్లి మావోయిస్టులు అమర్చిన మందుపాతరకు కామయ్య బలికావడంతో గిరిజనులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.

సమాజ సేవలో భాగస్వాములు కావాలి

పెద్దవంగర, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : సమాజ సేవలో ప్రతి ఒక్కరూ భాగస్వాములై తమవంతు సహకారం అందించాలని ఎంఈవో బుధారపు శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం మండలంలోని కొరిపెల్లి ప్రాథమిక పాఠశాలలో లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి తొర్రూరు ఆధ్వర్యంలో గుండా సోమయ్య జ్ఞాపకార్థం వారి కుమారుడు శ్రీనివాస్, కుమార్తె మంజుల సహకారంతో విద్యార్థులకు భోజన ప్లేట్లు, వాటర్ బాటిల్స్‌ను అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం మధుసూదన్, లయన్స్ క్లబ్ ఆఫ్ సేవా తరుణి తొర్రూరు అధ్యక్షుడు శ్రీదేవిరెడ్డి, ప్రతినిధులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అన్నదాత.. జరభద్రం..!

- వానాకాలంలో పొంచి ఉన్న ప్రమాదాలు ● నిర్లక్ష్యంగా ఉంటే ప్రాణాలకే ముప్పు
- విష పురుగులు, పిడుగులు, కరెంట్‌తో జాగ్రత్త.. ● వాగు దాటే సమయంలో అప్రమతంగా ఉండాలి



స్టార్టర్ బాక్స్‌ను నిర్లక్ష్యంగా తెరిచిన రైతు

లింగాలఘణపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలం మొదలైంది.. రైతులు పొద్దున లేచింది మొదలు రాత్రి పొద్దుపోయే దాకా పొలాలే వద్దే పనుల్లో తలమనకలవుతారు. పని ధ్యాసతో జరగబోయే ప్రమాదాలను పసిగట్టలేక ప్రాణాల మీదకు తెచ్చుకునే సందర్భాలు ఎన్నో. వర్షాకాలంలో పిడుగులు పడే అవకాశాలు ఉంటాయి. విద్యుదాఘాతాలు, పాములు, తేళ్లతో ప్రాణగండం పొంచి ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో అన్నదాతలు కాస్త జాగ్రత్తగా ఉంటే ప్రమాదాల నుంచి బయటపడొచ్చు.

పిడుగులు, వరదలతో భద్రం..

వానలతో తడవకుండా ఉండేందుకు రైతులు చెట్ల కిందకు పరుగెడుతుంటారు. ఆ సమయంలో ఉరుములు, మెరుపులతో పిడుగులు పడే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పిడుగులు ఎక్కువ శాతం ఎత్తైన చెట్లమీద పడనుండటంతో ఆ సమయంలో చెట్ల కింద ఉన్నప్పుడు పిడుగుపాటుకు ప్రాణాలను కోల్పోయే ప్రమాదం ఉందని గుర్తించాలి. అలాగే, వర్షం కురిసే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాల వద్ద ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదు. వర్షం సమయంలో తమ మొబైల్‌ఫోన్లను స్విచ్ఛాఫ్ చేసుకోవడం మంచిది. వర్షం నుంచి తలదాచుకోవాలనుకుంటే వ్యవసాయ బావుల వద్ద వేసుకున్న గుడిసెలు, చిన్న పాకల వద్దకు వెళ్లాలి. లేదంటే బండరాళ్ల మాటున తలదాచుకోవడం శ్రేయస్కరం. వాగులు, వంకలు దాటే సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలి.

పొంచి ఉన్న విద్యుత్ ప్రమాదాలు..

వర్షాకాలం సీజన్‌లో రైతులకు ప్రధానంగా విద్యుత్ ప్రమాదాల గండం పొంచి ఉంటుంది. వ్యవసాయ బావుల వద్ద విద్యుత్ పంపుసెట్ల కోసం ఏర్పాటు చేసిన స్టార్టర్ డబ్బాల్లో ఎలుకలు చొరబడి విద్యుత్ వైర్లను కొరుక్కుతింటాయి. దీంతో షాక్‌కు గురయ్యే అవకాశం ఉంటుంది. స్టార్టర్ డబ్బా పైకప్పును తొలగించి వాడుతుంటారు. ఇది ఎంతో ప్రమాదకరం. తడి చేతులతో మోటార్ ఆన్ చేస్తే



ట్రాన్స్‌ఫార్మర్‌పై విద్యుదాఘాతంతో చనిపోయిన పాము

షాక్ వస్తుంది. స్టార్టర్ ఆన్ చేసే క్రమంలో రబ్బర్ చెప్పులు ధరించడం శ్రేయస్కరం. ట్రాన్స్‌ఫార్మర్ మీద విద్యుత్ సమస్య ఉత్పన్నమైతే సంబంధిత అధికారులకు సమాచారమిచ్చి పరిష్కరించుకోవాలి.

- విషపురుగులతో గండం..

విష పురుగులతో రైతులకు ఎంతో గండం నెలకొంది. వర్షాకాలంలో ఉక్కపోతకు పాములు బయటకు వస్తుంటాయి. ముఖ్యంగా పొలాల గట్లపై ఉన్న గడ్డిపొదల్లో పాములు, తేళ్లు తిరుగుతుంటాయి. అన్నదాతలు చెప్పులు లేకుండా పొలాల గట్లపై తిరుగుతున్నప్పుడు విషపురుగులు కాటేసే ప్రమాదం ఉంది. పశువులకు మేత వేసే క్రమంలో గడ్డిలో పాములు, తేళ్లు వెచ్చదనం ఉంటాయి. ఇలాంటి క్రమంలో పాముల నుంచి రక్షణ పొందాలంటే నేరుగా చేతులతో కాకుండా చేతికర్రల సాయంతో ముందుగా గడ్డిని తెప్పలుతెప్పలుగా వేరు చేయడం మంచిది.

స్థానిక ఎన్నికలలో గులాబీ జెండా ఎగురవేయాలి

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య

రఘునాథపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): త్వరలో జరుగబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో గులాబీ జెండా ఎగురవేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు చేస్తున్న మోసాలను ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శుక్రవారం బీఆర్ఎస్ ముఖ్యకార్యకర్తల సమావేశానికి మండల కన్వీనర్ మునిపట్ల విజయ్ కుమార్ అధ్యక్షత వహించగా, రాజయ్య మాట్లాడారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం నిజాయితీగా పని చేసిన బీఆర్ఎస్‌కు మాత్రమే ఓట్లు అడిగే హక్కు ఉందని, కాంగ్రెస్ అధికారం చేపట్టిన 17నెలల నుంచి ప్రజలకు చేసింది ఏమి లేదని ఆరోపించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి రాజకీయ జీవితమే వెన్నుపోట్ల చరిత్రగా మిగిలి పోయిందని విమర్శించారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జి వై.కుమార్ గౌడ్, ఆకుల కుమార్, గైని శ్రీనివాస్, పెండ్లి మల్లారెడ్డి,



సమావేశంలో మాట్లాడుతున్న రాజయ్య

గూడ కిరణ్ కుమార్, కావటి రాజయ్య, మడ్లపల్లి సునీత, గవ్వాని నాగేశ్వర రావు, ముప్పిడి శ్రీనివాస్, హరీష్, బాబురావు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా



మునిసిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న నాయకులు

జనగామ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కారించాలని డిమాండ్ చేస్తూ సీపీఎం ఆధ్వర్యంలో జనగామ మునిసిపల్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు అందజేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి మాట్లాడుతూ పట్టణంలో సమస్యలు పేరుకుపోయినా పరిష్కరించడంలో పాలకులు పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. పట్టణంలో ఎక్కడి చెత్త అక్కడే నిలిచిపోవడంతో ప్రజలు రోగాలబారిన పడుతున్న కూడా మునిసిపల్ అధికారులకు పట్టడంలేదని మండిపడ్డారు. ఐఎస్ఐ మార్క్ లేకుండా ఇష్టరాజ్యంగా వాటర్ ప్లాంట్‌ను నడుపుతున్నా పట్టించుకునేవారు కరువయ్యారన్నారు. మూడో విడత ఇందిరమ్మ ఇళ్లకు ఇంటి నంబర్లు వేయాలని, అర్హులందరికీ కొత్త పెన్షన్లు మంజూరు చేయాలని, రంగప్ప చెరువు పర్యాటన కేంద్రంగా తీర్చిదిద్దాలని, డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జోగు ప్రకాశ్, ఇర్రి అహల్య, భూక్య చందు నాయక్, పోతుకునూరి ఉపేందర్, కల్యాణం లింగం, పల్లెర్ల లలిత పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో నిషేధిత పత్తి విత్తనాల విక్రేత?

- బీటీ-త్రీ కేజీ ప్యాకెట్ రూ.750 తీసుకవచ్చి.. రూ.1800 విక్రయం

మరిపెడ రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గుండెపూడిలో ప్రభుత్వ నిషేధిత, క్యాన్సర్ వ్యాధి సోకే ప్రమాదం పొంచి ఉన్న బీటీ-త్రీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. గుండెపూడికి చెందిన నలుగురు వ్యక్తులు జోరుగా బీటీ-త్రీ పత్తి విత్తనాలు అమ్ముతున్నారు. ఈ సంవత్సరం సుమారు 15టన్నుల బీటీ విత్తనాలు విక్రయించారనే సమాచారం. మండల ప్రాంతంలోని బుర్హాన్‌పురం, తానంచర్ల, బావోజీగూడెం, వెంకంపాడు, గిరిపురం, తదితర ప్రాంతాల్లో విక్రయించడమే కాకుండా సూర్యాపేట జిల్లాకు వీరి వ్యాపారం విస్తరించింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అనంతపూర్, గుంటూరు జిల్లా కేంద్రాల్లో అతి తక్కువ (ధర కేజీ ప్యాకెట్ రూ 750) తీసుకవచ్చి, అధిక ధరలకు (కేజీ ప్యాకెట్ రూ.1500 నుంచి రూ.1800) రైతులకు విక్రయిస్తున్నారనే సమాచారంతో మానుకోట జిల్లా సీసీఎస్ పోలీసులు నిఘా పెట్టారు. అందులో భాగంగానే రెండు రోజుల కిందట గుండెపూడికి చెందిన వ్యక్తి వద్ద నుంచి బీటీ-త్రీ పత్తి విత్తనాలు రెండు కేజీలు దొరికాయి. కాగా, ఈ నలు గురు ముఠానే గత రెండు వారాల కిందట తొర్రూర్, సూర్యాపేట, గత సంవత్సరం మండల కేంద్రం శివారు దేశ్యా తండాలో పోలీసులకు దొరికారు. కాగా, ఈ నలు గురు వ్యక్తులపై పీడీ కేసు నమోదు చేయాలని వ్యవ సాయ శాఖాధికారులు పోలీసులకు సూచించినట్లు తెలిసింది.

గంజాయి పట్టివేత

గణపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఓ యువకుడు గంజాయిని తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు సీఐ మల్లేష్ తెలిపారు. శుక్రవారం గణపురం మండల కేంద్రంలోని ఠాణాలో నిందితుల వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మండలంలోని వెంకటేశ్వర్లపల్లికి చెందిన బెడ్డల శ్రీనివాస్ హైదరాబాద్‌లోని ఒక హోటల్‌లో పనిచేస్తున్నాడని తెలిపారు. పని ప్రదేశంలోనే మహారాష్ట్రలోని బల్లార్షకు చెందిన సల్మాన్ మజీద్ ఖాన్‌తో పరిచయం ఏర్పడిందని పేర్కొన్నారు. గంజాయిని విక్రయించి ఈజీగా మనీ సంపాదించవచ్చని సల్మాన్ కిలో గంజాయిని శ్రీనివాస్‌కు అప్పగించారన్నారు. ఇదే క్రమంలో శ్రీనివాస్ తన గ్రామానికి చెందిన జనగాం ప్రేమ్‌తేజ్‌తో కలిసి గాంధీనగర్ శివారులో అనుమానాస్పదంగా తారస పడ్డారన్నారు. దీంతో ఎస్సై అశోక్ వారి వద్దకు వెళ్లడంతో ప్రేమ్‌తేజ్ అక్కడి నుంచి పారిపోగా శ్రీనివాస్‌ను అదుపులోకి తీసుకుని విచారించి కిలో గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. కాగా, ప్రేమ్‌తేజ్ పరారీలో ఉన్నాడని తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సైలు అశోక్, అమూల్య, సిబ్బంది పాల్గొన్నారు.

గట్టమ్మ వద్ద ..

ములుగు రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కేంద్రంలోని గట్టమ్మ దేవాలయం వద్ద గంజాయి తరలిస్తున్న బాలుడిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై వెంకటేశ్వరావు తెలిపారు. శుక్రవారం గట్టమ్మ దేవాలయం వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఓ బాలుడు బైక్‌పై కనిపించాడని చెప్పారు. అతన్ని ఆపేందుకు ప్రయత్నించగా వెనక్కి తిరిగి పారిపోయేందుకు ప్రయత్నించాడని తెలిపారు. అతన్ని వెంబడించి అదుపులోకి తీసుకొని తనిఖీ చేయగా కిలో ఎండు గంజాయి లభించిందని అన్నారు. విచారించగా స్వగ్రామం భూపాలపల్లి జిల్లా రేగొండ మండలకేంద్రంగా చెప్పాడన్నారు. అతన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశామని, ఆ యువకుడు మైనర్ అయినందున జువైనల్ హోంకు తరలించామని ఎస్సై పేర్కొన్నారు.

నారును నాశనం చేసిన గుర్తుతెలియని వ్యక్తులు

కొడకండ్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలకేంద్రానికి చెందిన రైతు కోట రఘుపతి పొలంలో మూడెకరాల్లో నాటడం కోసం నెల క్రితం పోసుకున్న నారుపై గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిమందు పిచికారి చేసి శుక్రవారం నాశనం చేశారు. రఘుపతి మాట్లాడుతూ రేపోమాపో నాటు వేసుకుందామనుకున్నట్లు తెలిపారు. ఉదయం పొలం వద్దకు వెళ్లి చూస్తే ఎకరానికి సరిపడా నారు నాశనమైందని వాపోయాడు. గుర్తు తెలియని వ్యక్తులు గడ్డిమందు నారుపై పిచికారి చేసినట్లు కనబడుతుందని ఆవేదన వ్యక్తం చేశాడు.

హైవేపై ఏర్పడిన గుంతలు పూడ్చివేత

మరిపెడ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎన్‌హెచ్ఏ 563పై మరిపెడ సోషల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాల దగ్గర ఏర్పడిన పెద్ద పెద్ద గుంతలను సోషల్ వెల్ఫేర్ గురుకుల స్కూల్ ప్రిన్సిపాల్, టీచర్లు శుక్రవారం డోజర్ సహాయంతో పూడ్చి వేశారు. ఈ సందర్భంగా ఆ స్కూల్ ప్రిన్సిపాల్ దయాకర్ మాట్లాడుతూ ఇటీవల గురుకుల సమీపంలో రోడ్డు ప్రమాదాలు తరుచూ జరుగుతుండడంతో స్కూల్ టీచర్లమందరం తలోచేయివేసి చేసిన ఆర్థికసాయంతో గుంతల పూడ్చివేసే పని చేపట్టినట్లు తెలిపారు. సహకరించిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కుమారస్వామి

తొర్రూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : బాలల హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా తొర్రూరుకు చెందిన డొనికెన కుమారస్వామి నియమితులయ్యారు. శుక్రవారం ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కోటగిరి చంద్రశేఖర్ నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కొనసాగుతున్న కుమారస్వామికి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించామన్నారు. జిల్లాలో బాలల పరిరక్షణ, అంటరానితనం రూపుమాపడంపై ఆయన చేస్తున్న సేవా కార్యక్రమాలు గుర్తించి నియించామన్నారు. కుమారస్వామి మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన కమిటీ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

కామింగ్ రైటింగ్ పోటీలకు విద్యార్థులు

జనగామ కల్చరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రపంచ జనాభా దినోత్స వాన్ని పురస్కరించుకొని నిర్వహించిన కామిక్ రైటింగ్ పోటీల్లో 72 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు డీఈవో డి.భోజన్న తెలిపారు. శుక్రవారం జన గామలోని సెయింట్ మేరీస్ ఉన్నత పాఠశాలలో ఎస్‌సీఈఆర్‌టీ, జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్య దుర్వినియోగంపై జిల్లా స్థాయి కామిక్ రైటింగ్ పోటీలు జరిగాయి. బహుమతి ప్రదానోత్సవంలో డీఈవో హాజరై మాట్లాడుతూ పోటీల్లో విద్యార్థులు సృజనాత్మకతను ప్రదర్శించా రన్నారు. విజతలకు ప్రశంసాపత్రాలు అందజేశారు. విజేతల కామిక్ రైటిం గ్ పత్రాలను ఎస్‌సీఈఆర్‌టీకి పంపించి, వారు ప్రచురించే కామిక్ రైటింగ్ బుక్‌లో ప్రచురిస్తామని ఏఎంవో బొమ్మన బోయిన శ్రీనివాస్ తెలిపారు. కాగా ఈ పోటీలకు ఉపాధ్యాయులు శామ్యూల్, ఆనంద్, నవీన్, అనిల్, యూఆర్ఎస్ ప్రత్యేకాధికారి శ్రీనివాస్ న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్

జనగామ కల్చరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కామన్ స్కూల్ విద్యా విధానాన్ని అమలు చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దొమ్మాట శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం జనగామలోని ఉమాపతి భవన్‌లో టీపీటీఎఫ్ జిల్లా సబ్ కమిటీ సమావేశం జరిగింది. జిల్లా అధ్యక్షుడు నల్లనాగుల రాజు అధ్యక్షత వహించగా శ్రీనివాస్ మాట్లాడుతూ ఉపాధ్యాయ విద్యా రంగ సమస్యలను ప్రభుత్వ వెంటనే పరిష్కరించాలని, ప్రభుత్వ పాఠశాలలను సెమీ రెసిడెన్షియల్ పాఠశాలలుగా మార్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల బదిలీలు, ప్రమోషన్ల ప్రక్రియను వెంటనే చేపట్టాలని, పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బిల్లులను విడుదల చేయాలని, పీఆర్సీ ప్రకటించాలని కోరారు.

విద్యారంగానికి 20% బడ్జెట్ కేటాయించాలని, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.అంకుషావలి, రాష్ట్ర కౌన్సిలర్ కుర్రెముల యాదగిరి, జిల్లా బాధ్యులు సత్యనారాయణరెడ్డి, వజ్రయ్య, రాజారెడ్డి, లక్ష్మణ్‌జీ, రాజేందర్, ప్రభాకర్, శారద, కవిత పాల్గొన్నారు.

ద్రవ రూపంలో నానో డీఏపీ

- రైతులకు ఎంతో ప్రయోజనం ● ప్రోత్సహిస్తున్న కేంద్ర ప్రభుత్వం



నానో డీఏపీ

వెంకటాపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గుళికల రూపంలో ఉన్న యూరియా, డీఏపీలకు బదులుగా ద్రవ రూపంలో తయారు చేస్తోంది. దీంతో రైతులకు రవాణా, దూర భారం తగ్గుతుంది. అర లీటరు నానో యూరియా, డీఏపీ ఒక బస్తా యూరియా, డీఏపీతో సమానం. పత్తి, కురగాయాల సాగుకు పైపాటుగా పిచికారి చేయాలి. దుకాణం నుంచి తీసుకురావడం, పొలానికి తీసుకుపోవడం నానో యూరియా, డీఏపీ చాలా సులువు. ఆదే బస్తా తీసుకెళ్లడంతో అన్నదాతలకు భారం అవుతుంది. ఒక బస్తా యూరియా ఎకరా పొలంలో వాడంతో 60 శాతం మాత్రమే మొక్క గ్రహించగలుగుతుంది. మిగితా 40 శాతం గాలిలో కలిసి వాయు కాలుష్యం ఏర్పడుతుంది. డీఏపీ కూడా దుక్కిలో వేయాల్సి ఉన్నా పైపాటుగా వేయడంతో నష్టమే కానీ, మొక్కకు ఎలాంటి ఫలితం దక్కదు.

రైతులు నానో యూరియా, డీఏపీలను నేరుగా కానీ ఏదైనా పురుగు మందులో కలిపి పతిపై పిచికారి చేయాలి. పిచికారి చేయడంతో నేరుగా ఆకుల ద్వారా మొక్క వంద శాతం గ్రహిస్తుంది. రసాయనిక ఎరువులు నేరుగా భూమిలో వేయడంతో భూ సాంద్రత తగ్గుతుంది. వర్షాభావ పరిస్థితిలో, అధిక వర్షపాతంలోను నానో యూరియాను పంపుతో పిచికారి చేయొచ్చు. దీంతో పంట ఎదుగుదల ఎక్కడా ఆగదు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం డీఏపీని కూడా ద్రవ రూపంలో తయారు చేస్తుంది. రైతులు సేంద్రియ ఎరువులను భూమిలో వేసి కలియ దున్నుకొని నానో ఎరువులను పంటలపై పిచికారి చేస్తే అధిక దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అధికారి మాడూరి శైలజ తెలిపారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్నాం..



ప్రస్తుతం పత్తి విత్తనాలు విత్తుకొని నెల రోజులు కావొస్తుంది. వర్షాలు అంతంత మాత్రంగానే కురుస్తున్నాయి. పైపాటుగా నానో డీఏపీ మొదటిసారి పిచికారి చేసుకోవచ్చు. తిరిగి రెండోసారి 50 రోజులకు పిచికారి చేసుకోవాలి. ఎకరాకు ఒక లీటరు రెండు దఫాలుగా పిచికారి చేయాలి. నానో ఎరువులపై రైతులకు అవగాహన కల్పిస్తున్నాం. ఇంకా చాలా మంది రైతులకు నానో డీఏపీ, యూరియాపై అవగాహన లేదు. ప్రతి ఫర్టిలైజరు దుకాణంలో విరివిగా నానో యూరియా, డీఏపీలను అందుబాటులో ఉంచాలి. రానురాను అన్ని రసాయనిక ఎరువులు ద్రవ రూపంలో వస్తాయి. - మాడూరి శైలజ, మండల వ్యవసాయ శాఖ అధికారి

గోదావరి పరవళ్లు

ఎగువ ప్రాంతాల్లో కురిసిన వర్షాలతో పోటెత్తుతున్న ప్రవాహం



చత్తీస్‌గఢ్ వైపు నుంచి బస్సులు నిలిచిపోవడంతో వరదనీరులో నడిచి వస్తున్న ప్రయాణికులు

- రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో..
- భూపాలపట్నం-హైదరాబాద్ జాతీయ రహదారిపై రాకపోకలకు బ్రేక్
- పేరూరు వద్ద 15.42 మీటర్లకు చేరిన నీటి ప్రవాహం

వాజేడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న వరద నీరుతో గోదావరి వరద ప్రవాహం ఒక్కసారిగా పెరిగిపోయింది. ములుగుజిల్లా వాజేడు మండలంలోని పేరూరు వద్ద ఉదయం 6గంటలకు 14.70 మీటర్ల నీటిమట్టంతో ఉన్న ప్రవాహం 8గంటలకు 14.92 మీటర్లు, 10 గంటలకు 15.12 మీటర్లు, 12గంటలకు 15.21 మీటర్లు, 2గంటలకు 15.29 మీటర్లు, 4గంటలకు 15.36 మీటర్లు, 5గంటలకు 15.39 మీటర్లు, సాయంత్రం ఆరుగంటలకు 15.42 మీటర్ల నీటి ప్రవాహంతో క్రమేణా గోదావరి పెరుగుతుందని సీడబ్ల్యూసీ అధికారులు పేర్కొన్నారు. అకస్మాత్తుగా గోదావరికి వరద ఉధృతి పెరగటంతో మండలంలో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. మండల కేంద్రం నుంచి గుమ్మడి దొడ్డి వెళ్లే రహదారి, పూసూరు-ఏడ్జర్లపల్లి, పేరూరు-చంద్రుపట్ల, కోయవీరా పురం గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పూసూరు-ముళ్లెకట్ట వంతెన వద్ద గోదావరి వరద ఉధృతితో జలకళను సంతరించుకుంది. ఈ క్రమంలో అధికారులు ఆయా గ్రామాలలో పర్యటించి లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, జీపీ కార్యదర్శులు వరద ఉధృతిపై నిత్యం సమీక్షిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

జాతీయ రహదారిపై రాకపోకలకు బ్రేక్

గోదావరికి వరద నీరు పోటెత్తడంతో అంతర్రాష్ట్ర రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భూపాలపట్నం-హైదరాబాద్ 163వ జాతీయ రహదారి టేకులగుడెం వద్ద ఉన్న రేగుమాగు వాగుకు వరద నీరు చేరి రహదారిని ముంచెత్తింది. దీంతో చత్తీస్‌గఢ్, తెలంగాణకు రాకపోకలు నిలిచిపోయి ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ క్రమంలో పేరూరు ఎస్సై గుర్రం కృష్ణప్రసాద్, ఎంపీడీవో శ్రీకాంత్ నాయుడు, తదితర అధికారులు వరద ఉధృతిని పరిశీలించి రాకపోకలను నిలిపివేశారు. కాగా, మండలంలోని టేకులగుడెం జాతీయ రహదారి పై ఉన్న రేగుమాగు వాగు వరద ఉధృతి కారణంగా అంతర్రాష్ట్ర రాకపోకలను నిషేధిస్తున్నట్లు ములుగు జిల్లా ఎస్పీ శభరీష్ ఒక ప్రకటనలో తెలిపారు. వరద ఉధృతి తగ్గే వరకు వంతెన పై ప్రయాణాలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారిపై ఉన్న వరదలో ఎవరూ దాటకుండా బారికేడ్లు, పోలీసు సిబ్బందిని ఏర్పాటు చేసినట్లు వివరించారు. ఇరు రాష్ట్రాల ప్రజలు ప్రయాణాలు అత్యవసరమైతే భూపాలపల్లి జిల్లా కాళేశ్వరం మీదుగా ప్రయాణం చేయాలని సూచించారు.

మొదటి ప్రమాద హెచ్చరికకు చేరువలో....

ఏటూరునాగారం రూరల్ (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు గోదావరికి వరద ఉధృతి పెరిగింది. శుక్రవారం సమ్మక్క బ్యారేజ్ గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల చేయడంతో ఏటూరునాగారం మండలంలోని రామన్నగూడెం పుష్కరఘాట్ వద్ద గోదావరి క్రమ క్రమంగా పెరుగుతోంది. శుక్రవారం పుష్కరఘాట్ వద్ద ఉదయం 8 గంటలకు గోదావరి నీటిమట్టం 13.990 మీటర్లు ఉండగా మధ్యాహ్నం 2 గంటలకు 13.580మీటర్లకు చేరి క్రమంగా పెరిగింది. సాయంత్రం 5 గంటలకు పుష్కరఘాట్ వద్ద గోదావరి నీటి 14.400 మీటర్లకు చేరింది. దీంతో గోదావరి ప్రవాహం క్రమంగా పెరుగుతుండడంతో మొదటిప్రమాద హెచ్చరికకు దాటి ప్రవహించనున్నట్లు జల వనరుల శాఖాధికారులు తెలిపారు. పుష్కరఘాట్ వద్ద 14.820 మీటర్లకు చేరితే మొదటి ప్రమాద హెచ్చరిక, 15.820 మీటర్లకు రెండవ ప్రమాద హెచ్చరిక, 17.320 మీటర్లకు చేరితే మూడవ ప్రమాద హెచ్చరికను అధికారులు జారీ చేయనున్నారు.



మంగపేట పుష్కరఘాట్ సమీపంలో ఉరుకలేస్తున్న గోదావరి



కమలాపురంలోని పొలాలకు చేరిన బ్యాక్ వాటర్

లోతట్టు ప్రాంతాలు జలమయం

మంగపేట (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలతో పాటు కాళేశ్వరం వద్ద లక్ష్మీబ్యారేజీ ఇతర బ్యారేజీలు, తుపాకులగూడెం సమ్మక్క బ్యారేజీ గేట్లను ఎత్తడం, ఉప నదులు, జలపాతాల నీరు తోడు కావడంతో మంగపేట మండలంలోని కమలాపురం బిల్ట్ ఇన్‌టేక్ వెల్, మంగపేట పుష్కరఘాట్ వద్ద గోదావరి వరద ప్రవాహం పెరుగుతోంది. బిల్ట్ ఇన్‌టేక్ వెల్ వద్ద శుక్రవారం ఉదయం 7.5 ఫీట్ల వరకు చేరిన గోదావరి ప్రవాహం ఆ తర్వాత కూడా కొనసాగింది. సాయంత్రానికి 8.5 ఫీట్లకు చేరింది. కమలాపురం ఎర్రవాగు, మంగపేట గౌరారంవాగు నీటికి గోదావరి వరదపోటు కమ్మడంతో బ్యాక్ వాటర్ పొలాలకు చెరుతోంది. గోదావరి వరద పోటు పెరుగుతుండడంతో వ్యవసాయ భూములు కోతకు గురై మునిగిపోతున్నాయి. కమలాపురం, మంగపేట, గంపోనిగూడెం, బోరునర్సాపురం, పొద్మూరు రైతుల భూములు గోదావరి వరద పోటుతో కోతకు గురై నీటిలో కలిసి పోతున్నాయి. వరద ప్రవాహం పెరుగడం వలన తీర ప్రాంత గ్రామాలైన చుంచుపల్లి, వాడగూడెం, పాలాయిగూడెం, దేవనగరం, కత్తిగూడెం, అకినేపల్లి- మల్లారం లోతట్టు ప్రాంతాలకు నెమ్మదిగా వరద నీరు చేరుతోంది. లోతట్టు ప్రాంతాల్లో వరద నీరు చేరుతుండటంతో రెవెన్యూ, పోలీస్, మండల పరిషత్, గ్రామపంచాయతీ అధికారులు శుక్రవారం వేర్వేరుగా పర్యటించి వరద నీటి ప్రవాహాలను పరిశీలించారు. కమలాపురం, పొద్మూరు, మంగపేట, బోరునర్సాపురం తీరం గ్రామాలను తహసీల్దార్ తోట రవిందర్, ఎస్సై టీవీఆర్ సూరి, ట్రైనీ ఎస్సైలు సురేష్, శ్రీకాంత్, ఆర్‌ఐలు శ్రీనివాస్, ఏసుపాదంతో పాటు తీర గ్రామాల పంచాయతీ కార్యదర్శులు వరద అంచనాను పరిశీలించారు.

సమ్మక్కసాగర్‌లోకి భారీ వరద

బ్యారేజిలోని మొత్తం గేట్ల ఎత్తివేత



బ్యారేజిలోకి వస్తున్న వరద నీళ్లు

కన్నాయిగూడెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలంలోని తుపాకులగూడెం వద్ద గోదావరి నదిపై ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజిలోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో పాటు ప్రాణహిత, ఇంద్రావతి నదుల నుండి భారీగా వరద నీళ్లు వచ్చి చేరుతుండటంతో గోదావరి ప్రవాహం ఉధృతంగా మారింది. ఎగువనుండి 7,46,410 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజిలోని మొత్తం 59 గేట్లు ఎత్తి బ్యారేజిని ఫ్రీఫ్లోగా ఉంచారు. సమ్మక్క సాగర్ బ్యారేజి వద్ద 82.10 మీటర్ల నీటి మట్టం నమోదైంది.



పంపింగ్ చేస్తున్న మోటార్లు

కొనసాగుతున్న దేవాదుల పంపింగ్

కన్నాయిగూడెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కన్నాయిగూడెం మండలంలోని గుట్టల గంగారం వద్ద ఉన్న చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టులో పంపింగ్ కొనసాగుతోంది. గురువారం సాయంత్రం వరకు ఫేజ్ 2,ఫేజ్ 3లో రెండు మోటార్ల చొప్పున మొత్తం నాలుగు మోటార్ల ద్వారా నీటిని ఎత్తి పోసిన అధికారులు గురువారం రాత్రికి ఫేజ్2 లోని రెండు మోటార్లను నిలిపివేసి ఫేజ్3 లోని రెండు మోటార్ల ద్వారా 583 క్యూ సెక్కుల నీటిని పంపింగ్ చేశారు. శుక్రవారం మధ్యాహ్నానికి ఫేజ్ 1 లో మరో మోటారు ను ఆన్ చేసి మొత్తం మూడు మోటార్ల ద్వారా పంపింగ్ కొనసాగిస్తున్నారు. ఫేజ్ 1 లో ఒక మోటారు,ఫేజ్ 2 లో రెండు మోటార్లు మొత్తం 3 మోటార్ల ద్వారా 831 క్యూ సెక్కుల నీటిని భూపాలపల్లి జిల్లా భీం ఘనపూర్ రిజర్వాయర్‌కు పంపింగ్ చేస్తున్నారు. దేవాదుల ఇన్‌టేక్ వెల్ వద్ద 83.3 మీటర్ల నీటి మట్టం నమోదైంది.



పేరూరు-చంద్రుపట్ల మధ్య ఉన్న మరిమాగు వాగు వంతెన పై వరద నీరు

మేడిగడ్డ బ్యారేజీకి కొనసాగుతున్న వరద

8.68లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

మహదేవపూర్ రూరల్, జూలై 11 : జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీకి వరద ప్రభావం కొనసాగుతోంది. ఎగువన కురుస్తున్న వర్షాలతో ఇన్‌ఫ్లో భారీగా నమోదవుతుంది. శుక్రవారం బ్యారేజీలోకి 8.68 లక్షల క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదుకాగా, 85 గేట్లను ఎత్తి అంతే నీటిని దిగువకు పంపిస్తున్నారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.60 మీటర్లుగా ఉంది.

కాళేశ్వరం వద్ద ప్రాణహిత పరవళ్లు

జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలంలోని కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద ప్రాణహిత నది పరవళ్లు తొక్కుతోంది. మహారాష్ట్రలోని ఎగువ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలకు భారీ వరద కాళేశ్వరం త్రివేణి సంగమం వద్ద గోదావరి నదిలో కలుస్తోంది. దీంతో గోదావరి నది నిండుగా ప్రవహిస్తుంది. శుక్రవారం సాయంత్రం మొదటి 11.79 మీటర్ల ఎత్తులో ప్రవహిస్తుంది. ఈ ప్రవాహం 12.200 మీటర్లు దాటితే మొదటి ప్రమాద హెచ్చరిక జారీ చేయనున్నారు.

తప్పుల తడకగా మెమోలు, ప్రొవిజినల్స్

- ఎంబీఏలో సీట్లు కోల్పోయిన విద్యార్థులు
- హనుమకొండలో ప్రముఖ విద్యాసంస్థ నిర్వాకం

హనుమకొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కొన్ని ప్రైవేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయి. విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నాయి. ఇవి చేసే తప్పులకు వారి జీవితాలు బలవుతున్నాయి. ఉన్నత చదువులు చదివే అవకాశాలను కోల్పోతున్నారు. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ జిల్లాలో పేరున్న ఓ విద్యాసంస్థలో కొందరు విద్యార్థులు ఇటీవల బీబీఏ పూర్తి చేశారు. వీరంతా ఎంబీఏలో చేరేందుకు ఇతర విద్యా సంస్థలో దరఖాస్తులు చేసుకున్నారు. ప్రవేశాల సందర్భంగా సర్టిఫికెట్లను పరిశీలించగా వాటిలో అనేక తప్పులు ఉన్నట్టు వెల్లడైంది.

ఈ విద్యాసంస్థ ఇచ్చిన మెమోలతో పాటు, ప్రొవిజినల్స్‌లో సైతం తప్పులు ఉన్నట్టు గుర్తించారు. బీబీఏ మూడో సెమిస్టర్, ఆరో సెమిస్టర్ మెమోలలో గ్రేడ్ల విషయంలో అన్నీ తప్పులే ఉన్నాయని, వాటి మీద ఉన్న క్యూఆర్ కోడ్ కూడా పని చేయడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొన్నారు. దీంతో ఎంబీఏలో సీటు ఇవ్వడానికి సదరు విద్యాసంస్థలు నిరాకరించాయని తెలిపారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఈ విద్యాసంస్థకు వచ్చి మొరపెట్టుకోవడంతో మెమోలు, ప్రొవిజినల్స్‌లో తప్పులను గమనించి నాలికకర్చుకున్నారు. వాటిని సరిచేసి ఇవ్వడానికి వారం పడుతుందని చావుకబురు చల్లగా చెప్పారు.

బయట అడ్మిషన్లు పూర్తయి తమ పిల్లలు సీటు కోల్పోయే పరిస్థితి ఉందని తల్లిదండ్రులు ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు లేకుండా పోయారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థ వారు తప్పులు దిద్ది ఇచ్చేసరికి పుణ్యకాలం గడిచిపోయి తమ పిల్లలు ఎంబీఏ సీట్లు కోల్పోయారని, ఒక సంవత్సరం వృథా అయిందని పలువురు తల్లిదండ్రులు వాపోయారు. విద్యాసంస్థ నిర్వాహకులు మార్కుల మెమోలను తయారు చేసేప్పుడు తగిన జాగ్రత్తలు తీసుకొని ఉంటే ఈ పరిస్థితి ఏర్పడేది కాదని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

గిరిజన మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

మంత్రి సీతక్క



అడ్డాకుల ప్లేట్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సీతక్క

గోవిందరావుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : గిరిజన మహిళలు ఆర్థికం గా అభివృద్ధి చెందాలని మంత్రి సీతక్క అన్నారు. మండలంలోని మొట్లగూడెం గ్రామంలో రాండ్‌స్టాడ్ గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్, సయోధ్య హోమ్ ఫర్ ఉమెన్ ఇన్ నీడ్ సహకారంతో సమ్మక్క,సారలమ్మ ఆదివాసీ సహకార సమాఖ్యకు కేటాయించిన అడ్డాకుల ప్లేట్ తయారీ యూనిట్‌ను ఆమె శుక్రవారం ప్రారంభించారు. అంతకుముందు వన మహోత్సవంలో భాగంగా ఆమె మొక్కను నాటారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజనులు అన్నిరంగాల్లో అభివృద్ధి చెందేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తుందని, గిరిజనులు వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగ కళ్యాణి, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్, ఎఫ్‌డీవో రమేష్, ఎఫ్ఆర్‌వో అబ్దుల్ రహమాన్, రాండ్‌స్టాడ్ గ్లోబల్ సంస్థ ప్రతినిధులు అక్యూల్, స్వప్న విట్టల్, మిక్కిలినేని సంయుక్త, ఫైల్ దాసికా, సీఎస్ఆర్ టీం సభ్యులు ప్రణధిపూర్ణ, శైలజ, వంశీకృష్ణ, వినయ్, స్మిత, ప్రజాప్రతినిధులు, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు. కాగా, మంత్రి సీతక్క ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల చింతలమోరి గొత్తికోయగూడెంలో శుక్రవారం పర్యటించారు. రాండ్‌స్టాడ్, స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు కుర్చీలు, స్కూల్ బ్యాగులు, ఆట వస్తువులు, పుస్తకాలను అందచేశారు.



అమ్మవారి సన్నిధిలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రెండో రోజూ కొనసాగిన శాకంబరీ ఉత్సవాలు

- వేల సంఖ్యలో దర్శించుకున్న భక్తులు
- అమ్మవారికి పూజలు చేసిన ఎమ్మెల్యే నాయిని

వరంగల్ కల్చరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): భద్రకాళి ఆలయంలో శాకంబరీ ఉత్సవాలు రెండో రోజూ కొనసాగాయి. దివ్యమైన రూపంతో శాకంబరీ అలంకరణలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. వేలాది మంది భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. శుక్రవారం వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. భక్తులకు శాకంబరీ కూరగాయల ప్రసాదం అందించారు. ఈ కార్యక్రమంలో ఈవో శేష భారతి, సూరింటెండెంట్ అద్దంకి విజయ్‌కుమార్, అర్చకులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.

గణనీయంగా పెరిగిన ఆదాయం

భద్రకాళి అమ్మవారి ఆదాయం ఈసారి గణనీయంగా పెరిగింది. 2024లో శాకంబరీ ఉత్సవాల ముగింపు రోజున టికెట్లు, ప్రసాదాల ద్వారా రూ. 4,01,127 ఆదాయం రాగా ఈ ఏడాది రూ.6,00,005 చేకూరింది. గత ఏడాదితో పోలిస్తే దాదాపు రూ.2లక్షలు అదనంగా లభించింది. కాగా, గత సంవత్సరం 15 రోజుల ఆదాయం రూ. 33,41,665 రాగా, ఈసారి రూ.48,00,274 ఆదాయం లభించింది. గత ఏడాది కంటే రూ.15 లక్షల అదనపు ఆదాయం లభించింది. ఉత్సవాలకు రాష్ట్రం నలుమూలల నుంచే గాక దేశ, విదేశాలనుంచి కూడా అమ్మవారిని దర్శించుకోవడానికి భక్తులు తరలివచ్చారు. దీంతో అమ్మవారి ఆదాయం గణనీయంగా పెరిగింది.

సోమనాథా.. మన్నించు

- ఆదికవికే కరువైన ఆలనాపాలన
- అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా పాల్కూరికి స్మృతి వనం
- ఉపయోగంలోకి తేవాలని కవులు, రచయితలు విజ్ఞప్తి





గదుల లోపలి భాగంలో అధ్వానంగా ఉన్న దృశ్యం, ధ్వంసమైన కిటికీలు

పాలకుర్తి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : తొలి తెలుగు విప్లవకవి, బసవ పురాణం గ్రంథకర్త పాల్కూరికి సోమనాథుడు జన్మించిన నేల పాలకుర్తి. ఆయన గుర్తుగా నిర్మించిన స్మృతివనం నేడు ఆలనాపాలనా లేక అధ్వానంగా తయారైంది. అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. జనగామ జిల్లా పాలకుర్తి మండల కేంద్రంలోని లక్ష్మీనర్సింహ స్వామి ఆలయానికి 50 అడుగుల దూరంలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కోటి రూపాయలతో సోమనాథుడి పేరుతో స్మృతి వనం నిర్మించింది. 2023 ఆగస్టు 4న అప్పటి మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి దాన్ని అట్టహాసంగా ప్రారంభించారు. ఇంతవరకు బాగానే ఉన్నా ఆ తర్వాత ప్రభుత్వం మారింది. దాన్ని ఎవరూ పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో మందు బాబులకు అడ్డాగా మారిపోయింది. గదుల్లో మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. తలుపులకు తాళాలు వేయక పోవడంతో కిటికీల అద్దాలను ఆకతాయిలు ధ్వంసం చేశారు. లైట్లు వెలుగక చీకట్లోనే ముగ్గుతోంది.

తలుపు తాళాలు లేక..

ఈ ప్రాంతంలో ఆసక్తి ఉన్న యువకులను కవులుగా, రచయితలుగా తీర్చిదిద్దేందుకు పాల్కూరి సోమనాథుడి పేరుతో అప్పటి ప్రభుత్వం స్మృతివనాన్ని నిర్మించింది. సాహితీవేత్తలు, వర్ధమాన రచయితలు సమావేశాలు జరుపుకునేందుకు మూడు హాల్‌లను నిర్మించింది. కవుల సాహిత్యాన్ని భద్రపరిచేందుకు గ్రంథాలయం కూడా నిర్మించింది. కాని దీని రక్షణ కోసం కనీసం అటెండర్‌ను కూడా నియమించక పోవడంతో ఆకతాయిలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రస్తుతం దీని నిర్వహణ ఏ ప్రభుత్వ శాఖ పరిధిలో ఉందో కూడా ఎవరికీ తెలియడం లేదు.



స్మృతివనాన్ని ఉపయోగంలోకి తేవాలి

సోమనాథుడి జన్మస్థలంలో స్మృతివనం నిర్మించి ఒక సాహితీ కేంద్రంగా మలచడానికి అప్పటి ప్రభుత్వం దేశంలోనే ఏ కవికి లేనంత భారీ శిలా విగ్రహాన్ని ఏర్పాటు చేసింది. ఇంకా మరికొన్ని పనులు పూర్తి చేస్తే సోమనాథుడి స్మృతివనం దేశంలోనే కవుల జన్మస్థలాలకు తలమానికంగా ఉండేది. ప్రస్తుత పాలకులు మిగతా పనులు పూర్తి చేయాలి. శిథిలావస్థకు చేరకముందే సోమనాథుడి స్మృతివనాన్ని వినియోగంలోకి తేవాలి.

\- డాక్టర్ రాపోలు సత్యనారాయణ, కవి, రచయిత పాలకుర్తి



పాలకుర్తిలో సోమనాథుడి స్మృతివనం

పశువుల సంతలా స్మృతివనం..

పాల్కూరికి స్మృతివనం గేటు నుంచి మొదలుకొని స్మారక చిహ్నం వరకు సీసీ రోడ్డు మొత్తం పేడతో నిండి ఉంది. లక్ష్మీనర్సింహస్వామి ఆలయానికి సమీపంలో ఉండడంతో ఆలయానికి వచ్చే భక్తులు కూడా ఆ పక్కకు రావడానికి ఇష్టపడడం లేదు. రెండు నెలల నుంచి పశువుల సంతలా తయారైంది. పక్కన పచ్చని గడ్డితో ఉండాల్సిన గార్డెన్ పశువుల కొట్టంలా తయారైంది. శిథిలావస్థకు చేరకముందే స్మృతి వనాన్ని పరిరక్షించాలని, వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ప్రజలు, కవులు, కళాకారులు, రచయితలు కలెక్టర్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు.



గూడాల్లో విద్యా ప్రమాణాలు పెంపొందిస్తాం

- విద్య, వైద్యం ప్రతి ఒక్కరికీ అందాలి
- గొత్తికోయగూడాల్లో ఎన్‌జీవోల సేవలు మరువలేనివి
- పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



చింతలమోరిలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

ఏటూరునాగారం రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఒక్కరికి విద్యను అందించడం ప్రభుత్వాల ప్రాథమిక హక్కు అని, గొత్తికోయ గూడాల్లో విద్య, వైద్యం, తాగునీటిని అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర పంచాయతీరాజ్, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి సీతక్క అన్నారు. శుక్రవారం ఏటూరునాగారం మండలంలోని చిన్నబోయినపల్లి గ్రామపంచాయతీ పరిధిలో గల చింతలమోరి గొత్తికోయగూడెంలో మంత్రి పర్యటించారు. గూడానికి చేరుకున్న మంత్రికి గొత్తికోయలు ఘనస్వాగతం పలికారు. అనంతరం రాండ్‌స్టాడ్, స్ఫూర్తి ఫౌండేషన్ సహకారంతో విద్యార్థులకు కుర్చీలు, స్కూల్ బ్యాగులు, ఆట వస్తువులు, పుస్తకాలను మంత్రి చేతుల మీదుగా అందచేశారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ గొత్తికోయగూడాల్లో ఎన్‌జీవోల సేవలు మరువలేనివని, గొత్తికోయవాసులకు అత్యున్నత సేవలను అందిస్తున్నారన్నారు. గొత్తికోయ గూడాలన్నీ అటవీ ప్రాంతాల్లో ఉండడంతో శాశ్వతంగా కార్యక్రమాలను చేపట్టలేకపోతున్నామని, కానీ ఉన్న వనరులతోనే మంచి సదుపాయాలను కల్పిస్తున్నామని మంత్రి తెలిపారు. గొత్తికోయల పట్ల అటవీశాఖ అధికారులు మానవతా దృక్పథంలో ఆలోచించాలన్నారు.

విద్య, వైద్యం, తాగునీరు ప్రతి ఒక్కరికీ అందేలా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి సీతక్క పేర్కొన్నారు. త్వరలోనే గొత్తికోయగూడాల్లో అంగన్‌వాడీ కేంద్రంతో పాటు పాఠశాలల నిర్మాణాలను ఉన్న దాంట్లోనే గొత్తికోయ ఇండ్లను పోలిన నమూనాలో చేపడుతామన్నారు. సేవ్ ద చిల్డ్రన్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో గొత్తికోయగూడాల్లో విద్యకు పునాదులు పడ్డాయని, గతంలోనే గూడాల్లో స్వతహాగా పాఠశాలలను ఏర్పాటు చేయడం జరిగిందని మంత్రి తెలిపారు. ప్రభుత్వం త్వరలోనే గొత్తికోయగూడాల్లో విద్యా బోధన జరిగేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. కొత్తగా అడవిని నరక కూడదని, ఏజెన్సీ గ్రామాల్లోని గిరిజనుల జీవనోపాధికి అటవీశాఖ ప్రయత్నాలు చేస్తోందన్నారు. అడవుల్లో సహజ సిద్ధంగా లభించే వాటిని రోడ్లపై పెట్టుకునేందుకు అటవీశాఖ తోడ్పాటు అందిస్తోందని, అడవులను కాపాడుకుంటేనే మనుగడ సాధించగలుగుతామని, అటవీ జంతువులను వేటాడ కూడదని సూచించారు. గొత్తికోయగూడాల్లో గిరిజన శాఖ ద్వారా సోలార్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని, అటవీ శాఖాధికారులు ఏజెన్సీ వాసులతో స్నేహపూర్వకంగా మెదగాలన్నారు. అడవుల పెంపకంలో వారిని భాగస్వామ్యం చేయాలన్నారు. కార్యక్రమంలో కలెక్టర్ టీఎస్.దివాకర, గ్రంథాలయ సంస్థ చైర్మన్, మార్కెట్ కమిటీ చైర్మన్ రేగా కళ్యాణి, ఎంపీడీవో కుమార్, తహసీల్దార్ జగదీశ్వర్, రాండ్‌స్టాడ్ ప్రతినిధులు అఖిల్, పీపుల్స్ హెల్ప్ చిల్డ్రన్ ప్రతినిధి సంతోష్, కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎలిశెట్టిపల్లిలో పాఠశాలను ప్రారంభించిన మంత్రి

మండలంలోని ఎలిశెట్టిపల్లిలో రూ.15 లక్షలతో నిర్మించిన నూతన పాఠశాల భవనాన్ని మంత్రి సీతక్క శుక్రవారం ప్రారంభించారు. గ్రామానికి చేరుకున్న మంత్రి జంపన్నవాగుకు వరద తాకిడి పెరగడంతో ట్రాక్టర్ సహాయంతో మంత్రి ఎలిశెట్టిపల్లికి చేరుకొని పాఠశాలను ప్రారంభించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ వచ్చే వర్షాకాలం నాటికి జంపన్నవాగుపై బ్రిడ్జి నిర్మాణాన్ని చేపడుతామని, గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణాలను పూర్తిచేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

వ్యక్తిపై కేసు నమోదు

మొగుళ్లపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్న వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్సై బి.అశోక్ శుక్రవారం తెలిపారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని పెద్దకోమటిపల్లి గ్రామానికి చెందిన దుండ్ర అజయ్ అనే వ్యక్తి ఓ మహిళతో వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నాడు. శుక్రవారం ఓ ఇంట్లో ఇద్దరూ ఉండగా చుట్టుపక్కల వారు గమనించి ఆమె భర్తకు సమాచారం అందించారు. దీంతో అతను ఆవ్యక్తిపై ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై బి.అశోక్ పేర్కొన్నారు.

ఇసుక డంప్‌ల సీజ్



కాల్వపల్లిలో ఇసుక డంప్‌ను సీజ్ చేస్తున్న రెవెన్యూ అధికారులు

చిట్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కాల్వపల్లి శివారులో 8 చోట్ల డంప్ చేసిన ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ షేక్ ఇమామ్ బాబా తెలిపారు. కాల్వపల్లి శివారు మానేరు వాగు నుంచి ఇసుకను అనుమతి లేకుండా తరలించి పలుచోట్ల నిల్వ చేసినట్లు సమాచారం అందిందన్నారు. దీంతో వెళ్లగా సుమారు 270 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను గుర్తించి సీజ్ చేశామన్నారు. ఆయన వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, సిబ్బంది ఉన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై విద్యార్థులకు అవగాహన

కాటారం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కాటారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం కేడీసీసీ బ్యాంకు ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. డీసీసీబీ చైర్మన్ కొండూరి రవీందర్‌రావు పుట్టిన రోజును పురస్కరించుకుని విద్యార్థులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేసిన అనంతరం విద్యార్థులకు డిజిటల్ కరెన్సీ, ఆర్థిక అక్షరాస్యతపై బ్యాంకు మేనేజర్ హరిరాంనాయక్ అవగాహన కల్పించారు. విద్యార్థి దశ నుంచే పొదుపుచేయడం, బ్యాంకుల్లో జరిగే లావాదేవీలు తెలుసుకోవడం జరగాలన్నారు. ప్రస్తుత సమాజంలో సైబర్ నేరాలు జరుగుతున్నాయని, విద్యార్థులు తమ తల్లిదండ్రులకు దీనిపై అవగాహన కల్పించాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సమ్మయ్య, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ రాజిరెడ్డి, టీచర్లు పద్మజ, రజిత, విజయలక్ష్మి, బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

కల్వర్టు, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టాలి

వెంకటాపురం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిప్పాపురం గ్రామపంచాయతీ పరిధిలోని కలిపాకలో కల్వర్టు, రోడ్డు నిర్మాణ పనులను వెంటనే చేపట్టాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం గ్రామంలో జరిగిన సంఘం సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏజెన్సీ ప్రాంతంలోని ఆదివాసీలు నివసిస్తున్న కలిపాక నుంచి పెంకవాగు వరకు కల్వర్టు, రోడ్డు లేకపోవడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అలాగే పాఠశాలకు ఉపాధ్యాయులు రాని పరిస్థితి నెలకొందని అన్నారు. కలిపాక గ్రామం చుట్టూ వాగు ఉండడంతో వాగు దాటే సమయంలో ప్రజలు ప్రాణాలు కోల్పోయిన సందర్భాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఆదివాసీల సమస్యలను గాలికి వదిలేసి విధులకు సక్రమంగా హాజరుకాని తిప్పాపురం గ్రామపంచాయతీ కార్యదర్శిని విధుల నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని గతంలో ప్రభుత్వానికి, అధికారులకు విన్నవించినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆయన ఆవేదన వ్యక్తంచేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కల్వర్టు, రోడ్డు నిర్మాణాన్ని చేపట్టాలని కోరారు. లేనట్లయితే సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు తాటి రాంబాబు, మిడియం రమేష్, బాడిశ రామక్క, కుంజ బాలమ్మ, మిడియం సంగీత, సత్యవతి, మల్లేష్, ప్రియాంక, పూర్ణ, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతలో పోలీసులు



రజియాకు బియ్యం, నగదు అందజేస్తున్న డీఎస్పీ రవీందర్

వెంకటాపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : శాంతిభద్రతల రక్షణతోపాటు సామాజిక బాధ్యతలో పోలీసులు ముందుంటారని ములుగు డీఎస్పీ నలువాల రవీందర్ అన్నారు. మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామానికి చెందిన ఎస్‌డీ.రజియా కుమారుడు చాంద్‌పాషా ఇటీవల మృతి చెందగా పోలీసులు స్పందించారు. శుక్రవారం డీఎస్పీ రవీందర్ బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం, రూ.2వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు కూడా సమాజంలో భాగమేనని అన్నారు. సమాజహితం కోసం తాము కూడా ముందుంటామని వెంకటాపూర్ పోలీసుల మానవీయ కోణాన్ని అభినందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై చల్ల రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

వేధిస్తున్నాడని పినతండ్రి హత్య

(5వ పేజీ తరువాయి)

ఆమెకు అప్పటికే ఒక కుమార్తె, కుమారుడు ఉన్నారు. రవి, రేణుకలకు ఒక కుమారుడు జన్మించాడు. కొన్నాళ్లు వారి జీవనం సజావుగానే సాగించినా, ఆ తర్వాత మద్యానికి బానిసై భార్య రేణుకను, ఆమె పెద్ద కుమారుడు శ్రీకర్‌ను కొడుతూ వేధించేవాడు. ఈవిషయమై చాలా సార్లు గ్రామంలో పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలోనే శ్రీకర్.. పినతండ్రి రవిపై కోపం పెంచుకున్నాడు.

గురువారం సాయంత్రం పినతండ్రి రవిని శ్రీకర్ తన ద్విచక్ర వాహనంపై బుగులోని జాతర గుట్టల పరిసరాలకు తీసుకొచ్చాడు. ఇద్దరూ కలిసి మద్యం సేవించారు. మత్తులో ఉన్న రవికి శ్రీకర్‌కు వాగ్వాదం చోటు చేసుకుంది. అది ముదరడంతో శ్రీకర్‌పై రవి దాడిచేశాడు. తిరగబడిన శ్రీకర్ రవి మెడకు తాడు బిగించి హత్య చేసి పారిపోయాడు. శుక్రవారం సాయంత్రం గొర్రెల కాపరులు మృతదేహాన్ని చూసిపోలీసులకు సమాచారం అందించగా ఎస్సై సందీప్ కుమార్ సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. కాగా, 20 ఏళ్ల శ్రీకర్ లిఫ్ట్ మెకానిక్‌గా పనిచేస్తున్నాడు. మొదటి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై సందీప్‌కుమార్ తెలిపారు.

పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి స్థల పరిశీలన

రేగొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిగోరి మండల కేంద్రంలో నూతన పోలీస్‌స్టేషన్ నిర్మాణానికి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు స్థలాన్ని శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెలాఖరుకు పోలీస్‌స్టేషన్ భవన నిర్మాణానికి శంకుస్థాపనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లేదా ఇన్‌చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వస్తారన్నారు. స్థలం పరిశీలించిన వారిలో డీఎస్పీ సంపత్‌రావు, సీఐ మల్లేష్ యాదవ్, ఎస్సై సందీప్‌కుమార్, నాయకులు తదితరులు ఉన్నారు.

నీటి నిల్వలు లేకుండా చూడాలి

భూపాలపల్లిటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటి చుట్టూ నీటి నిల్వలు లేకుండా చూడాలని, లేకపోతే దోమలు, ఈగలతో రోగాలు వస్తాయని అదనపు కలెక్టర్ విజయలక్ష్మి సూచించారు. శుక్రవారం మెప్మా రిసోర్స్ పర్సన్స్ ఆధ్వర్యంలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని సుభాష్‌కాలనీలో నిర్వహించగా అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, మునిసిపల్ కమిషనర్ బిర్రు శ్రీనివాస్ హాజరయ్యారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలం కావడంతో ఇంటి చుట్టూ ఎవరికి వారే నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలని సూచించారు. అలాగే మునిసిపాలిటీ అధికారులు తగు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమంలో మెప్మా డీఎంసీ రాజేశ్వరి, కమ్యూనిటీ ఆర్గనైజర్ నిర్మల, రిసోర్స్ పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక క్వారీ అక్రమ వసూళ్లపై విచారణ

మంగపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లూరు ఇసుక క్వారీ లోడింగ్ కోసం అక్రమ వసూళ్లు చేస్తున్నారనే ఆరోపణలపై జిల్లా కలెక్టర్, ఎస్పీలు వేర్వేరుగా ఆదేశాలను శుక్రవారం జారీ చేశారు. ఆ ఆరోపణలపై స్థానిక తహసీల్దార్ టి.రవీందర్, ఎస్సై టీవీఆర్.సూరిలు సాయంత్రం తమ సిబ్బందితో విచారణ చేపట్టారు. ఆ విచారణ రిపోర్టును జిల్లా ఉన్నతాధికారులకు పంపించినట్లు తహసీల్దార్, ఎస్సైలు వెల్లడించారు.

కెమిస్టు, డ్రగ్గిస్టు మండల నూతన కార్యవర్గం

మంగపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మంగపేటలో శుక్రవారం కెమిస్టు అండ్ డ్రగ్గిస్టు అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. ముఖ్య అతిథులుగా సంఘం జిల్లా అధ్యక్షుడు తిప్పని కోటేశ్వర్‌వర్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి బచ్చు పూర్ణచందర్‌రావు, జిల్లా కోశాధికారి శ్రీధర్ ములుగు అసోసియేషన్ ఆధ్వర్యంలో హాజరై మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా బర్ల సంజీవరెడ్డి, ప్రధాన కార్యదర్శిగా సామాల సాంబశివరావు, కోశాధికారిగా వాలాద్రి శ్రీనివాస్‌రెడ్డిలను ఎన్నుకున్నారు.

గౌరవ వేతనం చెల్లించాలని బీఎల్‌వోల ఆవేదన

మల్హర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తమకు గౌరవ వేతనం చెల్లించాలని బీఎల్‌వోలు ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం కొయ్యూర్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఇది వరకు జరిగిన ఎలక్షన్లలో విధులు నిర్వహించిన తమకు ఇప్పటి వరకు గౌరవ వేతనం చెల్లించలేదన్నారు. తమకు ఒక్కొక్కరికి రూ.10వేల నుంచి రూ.15వేల వరకు వస్తాయని బీఎల్‌వోలు తెలుపుతున్నారు. శిక్షణ కార్యక్రమానికి ముందు అకౌంట్‌లో రూ.2500 జమ చేసినట్లు తెలిపారు.

ప్రభుత్వ పథకాల అమలుపై కళాజాత



మొగుళ్లపల్లిలో ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కళాకారులు

మొగుళ్లపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలకేంద్రంలో తెలంగాణ సాంస్కృతిక కళాకారులు కళాజాత నిర్వహించారు. గ్రామీణ మహిళల ఆర్థికాభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఉచిత గ్యాస్, గృహజ్యోతి, ఇందిరా మహిళా క్యాంటీన్ తదితర పథకాలను మహిళలు వినియోగించుకోవాలని కళాకారులు పాటల రూపంలో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల సమాఖ్య ఏపీఎం అంబాల రవివర్మ, సీసీలు బాబూరావు, శ్రీనివాస్, ప్రవీణ్, వీవోఏలు, కళాకారులు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపేటలో కళాకారుల ప్రదర్శన

వెంకటాపూర్: మండలంలోని లక్ష్మీదేవిపేట గ్రామంలో తెలంగాణ సాంస్కృతిక సారథి బోడ కిషన్ ఆధ్వర్యంలో కళాకారులు ప్రదర్శన నిర్వహించారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, వడ్డీలేని రుణాలు, ఉచిత గ్యాస్, గృహజ్యోతి, ఇందిరా మహిళా క్యాంటీన్, తదితర పథకాలను మహిళలు వినియోగించుకోవాలని కళాకారులు ప్రదర్శన ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాకారులు మార్త రవి, రాగుల శంకర్, విజయ్, బుచ్చన్న, నరేష్, తిరుపతి, సురేష్, రాజేందర్, శోభ, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనం

మల్హర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లారంలో గల శివ పంచాయతన సహిత భక్తాంజనేయ స్వామి దేవాలయంలోని అమ్మవారు శుక్రవారం భక్తులకు శాకంబరీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చింది. వివిధ రకాల కూరగాయలతో అమ్మవారిని సుందరంగా అలంకరించారు. అలాగే అమ్మవారికి వివిధ పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకుడు శ్యాంసుందర్‌శర్మ నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వ్యక్తిపై కేసు నమోదు

కృష్ణకాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భూపాలపల్లి జిల్లా ఇన్‌చార్జి సంక్షేమాధికారి మల్లీశ్వరిపై ఆరోపణలు చేస్తూ సోషల్ మీడియాలో పోస్టు చేసిన జిల్లా కేంద్రానికి చెందిన ఎం.సంతోష్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు భూపాలపల్లి సీఐ నరేష్‌కుమార్ శుక్రవారం రాత్రి వెల్లడించారు. ప్రభుత్వ అధికారుల పనితీరును దెబ్బతీసేలా నిరాధారమైన ఆరోపణలుచేయడం, ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయవద్దన్నారు. సోషల్ మీడియా వేదికలను సరైన మార్గంలో ఎంచుకోవాలని సీఐ సూచించారు.

యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీ ఎన్నిక

వాజేడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి కాకర్లపూడి విక్రాంత్ ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ప్రకటించారు. ఏడ్జర్లపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడిగా బట్టా శ్రీకాంత్, ఉపాధ్యక్షుడిగా కొండగొర్ల వెంకటేష్, కార్యదర్శిగా చెన్నం నవీన్, కోశాధికారిగా వాసం ఆదినారాయణను వీరితో పాటు 8మంది సభ్యులను ఆయన ప్రకటించారు. ఈ సందర్భంగా విక్రాంత్ వర్మ మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను అర్హులకు వర్తింపచేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గౌరరాపు సర్వేశ్వరరావు, నాయకులు తల్లడి ఆదినారాయణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

వెంకటాపూర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : చికిత్స పొందుతూ ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన వెంకటాపూర్ మండలంలోని బావుసింగ్‌పల్లి గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానిక ఎస్సై చల్ల రాజు తెలిపిన ప్రకారం.. బావుసింగ్‌పల్లి గ్రామానికి చెందిన ల్యాదెల్ల నరేష్(40) ఆర్థిక పరిస్థితులు బాగా లేకపోవడంతో మద్యానికి బానిసై ఈనెల 7వ తేదీన పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబసభ్యులు ములుగు ఏరియా ఆస్పత్రికి తరలించగా మెరుగైన వైద్యం కోసం హనుమకొండకు రెఫర్ చేశారు. ఈక్రమంలో నరేష్ నగరంలోని ఓఆస్పత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై వివరించారు.

సీఎం, మంత్రి దుద్దిళ్ల ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్‌పై నేతల సంబరాలు



కాటారంలో సంబరాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కాటారం, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని అంబేద్కర్ కూడలిలో కాంగ్రెస్ నాయకులు శుక్రవారం సంబరాలు నిర్వహించారు. సీఎం రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు చిత్రపటాలకు క్షీరాభిషేకం చేసి టపాసులు కాల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు కోసం కేబినెట్‌లో నిర్ణయం తీసుకోవడంపై కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. బలహీన వర్గాల హక్కుల పరిరక్షణ, సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని పలువురు నాయకులు అన్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌లో చెప్పినట్లుగా కుల గణన చేపట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో రాష్ట్రం దేశానికి ఆదర్శంగా నిలిచిందని కొనియాడారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పంతకాని సమ్మయ్య, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు చీమల సందీప్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, యూత్ మండల అధ్యక్షుడు మహేష్, మహిళా అధ్యక్షురాలు మహేశ్వరి, నాయకులు మల్లయ్య, దేవేందర్‌రెడ్డి, నాయిని శ్రీనివాస్, నవీన్‌రావు, రాజేశం, అశోక్, తిరుపతిరెడ్డి, స్వామి, లచ్చిరెడ్డి, శ్రీహరి, రమేష్‌రెడ్డి, ప్రభాకర్, సమ్మయ్య, సమ్మిరెడ్డి, కుమార్, రఘురాం, రఘు, రాజు, రాజ్‌కుమార్, శ్రీశైలం, దేవదాసు, రాజేందర్, విక్రమ్, శకుంతల, మల్లయ్య, కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.



నైన్‌పాక పాఠశాలలో సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఉపాధ్యాయులు

పీఆర్టీయూతోనే సమస్యల పరిష్కారం

చిట్యాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): విద్యారంగం, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం పీఆర్టీయూ టీఎస్‌తోనే సాధ్యమవుతుందని సంఘం మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో శుక్రవారం సభ్యత్వ నమోదు కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ అపరిష్కృతంగా నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అయ్యేంతవరకు సంఘం ప్రతినిధులు పాటుపడుతారని తెలిపారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి సూదం సాంబమూర్తి, రాష్ట్ర, జిల్లా బాధ్యులు గోవిందుల సత్యనారాయణ, కూచనపల్లి శ్రీనివాస్, గిరగాని కృష్ణ, ఊర్మిలరెడ్డి, నూకల లింగయ్య, సదానందం, పల్లవి, రఫి, స్వరూపరాణి, రవీందర్, ఉమాదేవి, ప్రసాద్, శ్రీనివాస్, ప్రణీత, అనిల్ గవాస్కర్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అడవుల ప్రాముఖ్యతపై విద్యార్థులకు అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

గోవిందరావుపేట, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లా అటవీశాఖ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో విద్యనభ్యసిస్తున్న 9, 10 తరగతుల విద్యార్థులకు అటవీశాఖ అధికారులు శుక్రవారం అడవుల ప్రాముఖ్యత, అటవీ జంతువుల సంరక్షణపై డాక్యుమెంటరీ ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పస్రాఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ మాధవిశీతల్ మాట్లాడుతూ మానవ మనుగడకు చెట్లే ఆధారమని, అడవుల్లో చెట్లను నరకడం వల్ల భవిష్యత్‌లో ప్రమాదం వాటిల్లనుందని అన్నారు. అదేవిధంగా అటవీ జంతువులకు ఎలాంటి హాని చేయవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎంఈవో గొంది దివాకర్, ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ వేణుగోపాల్, బీట్ ఆఫీసర్లు దీప్‌లాల్, అర్జున్‌రెడ్డి, రమేష్, మౌనిక, శారద, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అటవీశాఖ ఆధ్వర్యంలో వనమహోత్సవం

మల్హర్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎడ్లపల్లి మోడల్ స్కూల్‌లో అటవీశాఖ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించి మొక్కల ఆవశ్యకత గురించి గ్రామస్థులకు వివరించారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని అధికారులు పిలుపునిచ్చారు. మోడల్ స్కూల్ ఆవరణలో సుమారు 20 వివిధ రకాల మొక్కలను నాటారు. ఇన్‌చార్జి డీపీవో వీరభద్రయ్య, రేంజర్ రాజేశ్వర్‌రావు, తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీవో శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పూర్ణచందర్, ఫారెస్టుసెక్షన్ ఆఫీసర్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

అదనపు ఖర్చులు లేకుండా యూరియా అందించాలి

- ఇన్‌చార్జి డీఏవోకు ఫర్టిలైజర్ యజమానుల వినతి



ఇన్‌చార్జి డీఏవో బాపుకు వినతిపత్రం అందిస్తున్న ఫర్టిలైజర్ యజమానులు

కృష్ణకాలనీ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అదనపు ఖర్చులు, ఇతర ఉత్పత్తులు అంటగట్టకుండా యూరియా సరఫరా చేసేలా చూడాలని ఫర్టిలైజర్ యజమానులు కోరారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖ అధికారి బాపును కలెక్టరేట్ కార్యాలయంలోని చాంబర్‌లో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. స్టాక్ పాయింట్ నుంచి యూరియా చేరే వరకు ఒక్కో బస్తాకు అదనంగా రూ.60 కిరాయి పడుతుందన్నారు. సరఫరాలో తలెత్తుతున్న ఇబ్బందులతో అనేక సమస్యలు ఎదురవుతున్నాయని వాపోయారు. యూరియతో పాటు బయో ఎరువులను బలవంతంగా అంటగడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యను ప్రభుత్వానికి నివేదించాలని వారు కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు వెంకన్న, మండల అధ్యక్షుడు ఎల్లారెడ్డి, నిర్వహణకార్యదర్శి ఉల్లాల రాంబాబు, రాజు, ప్రేమ్‌సాగర్, శ్రావణ్, కందునూరి శ్రీనివాస్, గుడిమల్ల రాజేష్, కమ్మల క్రాంతి, శ్యాంసుందర్, రాఘవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత

భూపాలపల్లిటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జనాభా నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రమణారావు అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అంతర్జాతీయ జనాభా నియంత్రణ దినోత్సవం మేరా యువ భారత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు హాజరై మాట్లాడుతూ మనుషులు పెరుగుతున్నారే గానీ భూమి పెరగడం లేదని అన్నారు. ఈ క్రమంలో జనాభా నియంత్రణకు కుటుంబ నియంత్రణ తప్పనిసరి అని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు రామచంద్రారావు, శ్రీధర్‌రెడ్డి, శ్రీనివాస్, విద్యార్థులు, యువ భారత్ ప్రోగ్రాం ఆర్గనైజర్ వెల్దండి సురేష్ పాల్గొన్నారు.

కొర్కిశాలలో వైద్యశిబిరం

మొగుళ్లపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొర్కిశాల గ్రామంతో పాటు మోడల్ స్కూల్, కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయంలో శుక్రవారం వైద్యఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వేర్వేరుగా వైద్య శిబిరాలు జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ నాగరాణి 56మంది గ్రామస్థులు, మోడల్ స్కూల్‌లో 105 మంది, కేజీబీవీలో 94 మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామస్థులు, విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించడంతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. శిబిరాల్లో మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ రాకేష్, కేజీబీవీ ప్రిన్సిపాల్ శైలజ, హెల్త్ అసిస్టెంట్ భిక్షపతి, ఏఎన్‌ఎం శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మల్లారంలో..

మల్హర్ : మండలంలోని మల్లారంలో తాడిచర్ల ప్రభుత్వాసుపత్రి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. 74 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీచేసినట్లు వైద్యాధికారి వినయ్‌భాస్కర్ తెలిపారు.